

# మినీకథావీధి

## ద్వంద్వం



మోనలిసా

"లక్ష్మమ్మక్కాయ్ ఏంచేస్తున్నావ్ ?" సాగదీసుకొంటూ వచ్చింది మీనాక్షమ్మ.

అప్పుడే కడుపునిండా భోజనం పట్టించిన శరీరాన్ని మంచం మీద చేర్చిన మహాలక్ష్మమ్మ ఉత్సాహంగా లేచింది. నిద్ర కంటే మీనాక్షమ్మ చెప్పే ఇరుగు పొరుగుల కబుర్లపైన మక్కువ ఎక్కువ ఆవిడకి.

"ఇప్పుడే భోజనమైంది ! కాస నడుం వాల్చుదామని ఇలా మంచం పైన వాలాను. రారా మీనాక్షీ !" నవ్వుతూ ఆహ్వానించింది. ఆమె తనను "అక్కా" అని పిలుస్తున్నందుకు ఎప్పటివలెనే మనసులో తిట్టుకొన్నా !

వరండాలో మహాలక్ష్మమ్మ పరచిన చాప మీద శరీరాల్ని జేరవేశారిద్దరూ.

"ఆ వనజకి తను కథలూ, గట్రా రాస్తుందని మహా గీరలెద్దూ! నిన్న కాస్త కబుర్లాడదామని వెళ్తే "పనిలో వున్నాను పిన్నిగారూ, మరోసారి రండి" అని చెప్తుందా? మనమేనా అంత పనల్లేక యిళ్ళెంట తిరుగుతూంది ! పేద్దతనే రాయగల్గినట్టు ఆ గర్వం? పేరు పత్రికలకీ, పేపర్లకీ యెక్కటం యిష్టంలేగ్గానీ, లేకపోతే నేనూ రాద్దును- కథలూ, నవల్సూ !"

మీనాక్షమ్మ మాటకి "అవునవు"నని ముక్తాయించింది మహాలక్ష్మమ్మ మనసులో "నీ మొహం ! నువ్వేం రాయగలవ్ ? రాయటానికి అసలు నీకు అక్షరాలు వచ్చునా ?" అనుకొని.

"అన్నట్టు లక్ష్మమ్మక్కాయ్ ! మొన్న మీ రోహిణిని పెళ్ళివారొచ్చి చూసెళ్ళారుగా ! ఏమైందా విషయం ?" ఆరా తీసింది మీనాక్షమ్మ.

"ఏం చెప్పనమ్మా!" గజం పొడుగు నిట్టూర్పు వదిలింది మహాలక్ష్మమ్మ.

"మేమిచ్చే కట్నం చాల్దట ! మరో అయిదు వేలు కావాల్ట ! మా రోహిణి గురించి నీకు తెలియన్దేముంది ? అన్ని పనులూ చిటికెలో చేసేస్తుంది. అందమన్నావా ? ఆ అప్సరసలు కూడా దిగదుడుపనుకో ! ఇటువంటి పిల్లను యెదురు కట్నమిచ్చి చేసుకోవల్సిందిపోయి మేమిచ్చే కట్నం చాలదంటారా ? ఆ దరిద్రపు కళ్ళకి డబ్బు తప్ప, మా అమ్మాయి అందమేం ఆనుతుంది ?"

"అయితే ఈ సంబంధం కూడా తప్పినట్లేనా ?" అన్నది మీనాక్షమ్మ.

"ఆc, అంతే ! మేమెక్కడ పొయ్యగలం వాళ్ళడిగినంతా ? ఇదిగాపోతే మరొకటి !"

"అవునే అక్కాయ్. పిల్లకేమంత వయసు మించిపోయిందని, కంగారుపడి చేసెయ్యటానికి !"

"ఈ కట్నాలదొక సమస్యయిపోయిందనుకో ! నన్నడిగితే అసలు కట్నమెందుకంటాను ! మగాడితోపాటు ఆడదికూడా ఇంటిపనులవీ చేస్తూ తన బాధ్యతను సమానంగా నిర్వర్తిస్తున్నప్పుడు ఇక ఈ కట్నాలు, కానుకలు ఏంటి, అసలు, అర్థం లేకుండా !" ఆవేశపడిపోతూ అన్నది మహాలక్ష్మమ్మ.

"అవునవును !" మీనాక్షమ్మ వంత పాడింది ! "అన్నట్టు అబ్బాయి రాజేంద్ర చదువదీ పూర్తయిపోవచ్చినట్లుంది ! ఈ ఏకు మాకేమైనా పప్పుభోజనాలున్నాయా!"

"ఏవీ, సరైన కట్నం రాందే," బాధగా మూల్గింది మహాలక్ష్మమ్మ. "ఈ మధ్య గుడివాడ నుంచి ఒకళ్ళొచ్చారు ముప్పైవేలు ఇస్తామంటూ. బోడి బియ్యే చదివి గుమాస్తా గిరీ చేస్తున్న వాళ్ళకే పాతిక వేలు ఇస్తున్నారాయె మన వాళ్ళల్లో ! అటువంటిది ఎం. కాం. చదివిన మా రాజేంద్రకి ముప్పై వేలేనా ? మా తర్వాత ఆ అయిదెకరాల పొలం, ఈ ఇలూ చెందేవి వీడికేనా ? అటువంటప్పుడు కనీసం ఏభై వేలన్నా రాకపోతే ఎలా ?"

ఇంతకుముందు తన కూతురి విషయంలో చెప్పినదానికి, ఇప్పుడు కొడుకు పెళ్ళి విషయంలో అంటున్నదానికి తూర్పు పడమరలకున్నంత తేడా వున్నదని గుర్తించలేకపోయింది మహాలక్ష్మమ్మ

గుర్తించిన మీనాక్షమ్మ, "తను గ్లాసుడు పంచదార అప్పు అడగడానికై వచ్చింది కాబట్టి" పైకి అనలేకపోయింది !

